క్లుప్తంగా

తైబజార్ వేలం వాయిదా

కొత్తూరు: మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం నిర్వహించే తైబజార్ వేలాన్ని వాయిదా వేసినట్లు కమిషనర్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్ పరిధిలో రోడ్లపై నిలిపే లారీలు, ఇతర వాహనాల నుంచి తైబజార్ నిర్వాహకులు డబ్బులు వసూలు చేయాలా..? వద్దా అనే ప్రశ్న తలెత్తడంతో వేలాన్ని నిలిపివేశారు. టెండర్‌లో పాల్గొన్న వ్యక్తులు వేసిన ఈ ప్రశ్నను మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్, సభ్యులతో చర్చించి వారి నుంచి సమాధానం తీసుకున్న తర్వాత వేలం చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు.

ఆగిర్యాల సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంపు


పనులను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

కొందుర్గు: మండలంలోని ఆగిర్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంపు పనులను అధికారులు ప్రారంభించారు. గతంలో ఇక్కడ 33 కేవీఏ సబ్‌స్టేషన్ ఉండగా విద్యుత్ కనెక్షన్‌లు ఎక్కువగా ఉన్నాయి. దీంతో లోఓల్టేజీ ఏర్పడి వ్యవసాయ బోరుమోటర్లు తరచూ కాలిపోయేవని రైతులు వాపోయారు. ప్రస్తుతం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని 5 ఎంఏకు పెంచారు. ఈ సందర్భంగా శనివారం విద్యుత్ అధికారులు పనులను ప్రారంభించారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

జీరో బిల్లు కోసం ప్రజల పాట్లు


జీరో బిల్లు ఆన్‌లైన్ కోసం క్యూ కట్టిన ప్రజలు

మొయినాబాద్‌రూరల్: ప్రజాపాలన దరఖాస్తులు ఇచ్చి కూడా జీరో బిల్లు రాకపోవడంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు జీరో బిల్లు ఆన్‌లైన్ కోసం క్యూ కడుతున్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జీరో బిల్లు కోసం వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు కావాల్సిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుంటున్నారు. గతంలో చేసిన ఆన్‌లైన్ సక్రమంగా కాలేదని పేర్కొంటున్నారు. ఇప్పుడైనా 200ల యూనిట్లలోపు కరెంటు బిల్లు ఉన్నా అమలు అవుతుందా లేదా అని అనుమానంతో వెళ్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జీరో బిల్లు పరిశీలనలో సందడి నెలకొన్నది.

రైల్వే గేటు వద్ద మరమ్మతులు


మూసివేసిన రైల్వే గేటు

షాద్‌నగర్: పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వే గేటు వద్ద రైల్వే అధికారులు రైలు పట్టాల మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో రైల్వే గేటును మూడురోజుల పాటు మూసివేస్తున్నట్లు తెలిపారు. గేటు మూసి వేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్రం ఆటంకం ఏర్పడింది. హైదరాబాద్ నుంచి బైపాస్ మీదుగా షాద్‌నగర్ పట్టణానికి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చటాన్‌పల్లి గ్రామానికి వెళ్లాలంటే లింగారెడ్డిగూడ గ్రామం నుంచి లేదంటే అన్నారం వైజంక్షన్ నుంచి జాతీయ రహదారి మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. లేదంటే కేశంపేట రైల్వే గేటు నుంచి రావాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. త్వరగా పట్టాల మరమ్మతులు పూర్తి చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు

చేవెళ్ల: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలతో నిరుపేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మల్కాపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ బి.రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో శనివారం చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరాన్ని గ్రామ నాయకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, యాదిరెడ్డి, ఇంద్రాసేనారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

ఏళ్లనాటి కల.. తీరనున్న వేళ


ఇటీవల కురిసిన వర్షానికి గుంతల్లో నిలిచిన నీరు

రూ.5కోట్లతో రోడ్డు అభివృద్ధి పనులు
- ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచన
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు, వాహనదారులు

కొత్తూరు: మున్సిపాలిటీ ముఖ ద్వారంలోని వై జంక్షన్ నుంచి రైల్వే వంతెన వరకు ఉన్న పాత జాతీయ రహదారి గుంతలమయంగా మారడంతో ప్రమాదకరంగా మారింది. ఏళ్లుగా కనీస మరమ్మతులు లేని కారణంగా రోడ్డుపై చాలాచోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు అందులో పడి ప్రమాదాలకు గురైన ఘటనలు చాలా ఉన్నాయి. దీనికి తోడు ముఖ్యుల రాకపోకల సమయంలో గుంతల్లో తాత్కాలిక మరమ్మతుల కోసం నాయకులు మట్టిని పోయించారు. దీంతో వాహనాల రాకపోకల సమయంలో విపరీతమైన దుమ్ము వెలువడుతుందని స్థానికులు వాపోతున్నారు. దుమ్ము కారణంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

రూ.5కోట్లతో రోడ్డు పనులు..

ఇటీవల రోడ్డు పరిస్థితిని స్థానిక నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకుపోవడంతో ఆయన వెంటనే స్పందించారు. ఆర్‌అండ్‌బీ, ఇతర శాఖల అధికారులు, నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో రోడ్డును పరిశీలించారు. వ్యాపారులు, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాధ్యమైనంత త్వరలో రూ.5కోట్లతో రోడ్డు పనులు చేపట్టడానికి ప్రణాళిక రూపొందించాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు విస్తీర్ణం తక్కువ ఉండడంతో కొత్తగా చేపట్టే రోడ్డును మరింత విస్తరించనున్నారు. రెండు వైపులా సుమారు 30 ఫీట్ల సీసీరోడ్లు, మధ్యలో లైటింగ్ కోసం డివైడర్లను ఏర్పాటు చేసేలా డిజైన్ తయారుచేయాలని ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. చాలా ఏళ్ల తర్వాత రోడ్డు అభివృద్ధి చెందనుండడంతో వ్యాపారులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారులు సహకరించాలి..



వై జంక్షన్ కూడలీ నుంచి రైల్వే వంతెన వరకు ఉన్న పాత జాతీయ రహదారి విస్తరణకు స్థానిక వ్యాపారులు, ప్రజలు సహకరించాలి. ప్రస్తుతం ఉన్న రోడ్డు ఇరుకుగా ఉండడంతో కొత్తగా వేసే రోడ్డును మరింత విస్తరించడం సంతోషకరం. సాధ్యమైనంత వరకు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు విస్తరణ చేయాలి.

– సుదర్శన్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేత, కొత్తూరు

నెలలో పనులు ప్రారంభం...

మరో నెలలో వై జంక్షన్ కూడలీ నుంచి రైల్వే వంతెన వరకు రోడ్డు పనులు ప్రారంభమవుతాయి. ఇప్పటికే రోడ్డును ఆర్‌అండ్‌బీ సీఈ మోహన్‌నాయక్, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారు సూచించిన మేరకు వ్యాపారులకు నష్టం వాటిల్లకుండా రోడ్డు డిజైన్‌ను రూపొందిస్తాం.

– సందీప్, ఆర్‌అండ్‌బీ ఏఈ, కొత్తూరు


పైపులైన్ లీకేజీ మరమ్మతులు నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సాయిబాబా దేవాలయం ఎదురుగా మంచినీటి పైపులైన్ లీకేజీతో రోడ్డంతా జలమయం అనే శీర్షికన శనివారం సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మధ్యాహ్నం పంచాయతీ అధికారులు, సిబ్బంది పైపులైన్ లీకేజీని పరిశీలించి మరమ్మతులు నిర్వహించారు. వాహనదారులు సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యలు అధికారులు తెలుసుకొని పరిష్కరించాల్సి ఉన్నా పత్రికల్లో వస్తేగానీ స్పందించడం లేదని స్థానికులు అంటున్నారు.

అనాథలకు సేవ చేయడం అభినందనీయం

మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని పెంపొందించుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న నరేందర్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఎఫ్‌సీఎన్ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బసిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అనాథలైన వారిని ఆదుకునేందుకు ఎఫ్‌సీఎస్ సంస్థ వారు ముందుకు రావడం హర్షణీయమన్నారు. అనాథలు, వృద్ధులకు ఆశ్రయాన్ని కల్పిస్తూ, వారి యోగ క్షేమాలను చూసుకోవడం అభినందనీయమన్నారు. సేవ చేయడం ద్వారా మనస్సుకు ఎంతో తృప్తి కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పాండురంగారెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా ప్రతినిధుల నియామకం


మొయినాబాద్‌రూరల్: వెంకటేశ్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న లక్ష్మినారాయణ


షాద్‌నగర్: నియామకపత్రం అందుకుంటున్న ప్రశాంత్‌గౌడ్

మొయినాబాద్‌రూరల్: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా మండలంలోని బాకారం గ్రామానికి చెందిన ఎలిగని వెంకటేశ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దుద్దాల లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎలిగని వెంకటేశ్‌గౌడ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకులు అంజన్‌కుమార్‌గౌడ్, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప, రాష్ట్ర నాయకులు కన్నాల ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు పాల్గొన్నారు.

జిల్లా అధికార ప్రతినిధిగా అరవింద్

నందిగామ: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా నందిగామ మండలంలోని నర్సప్పగూడ గ్రామానికి చెందిన వడ్ల అరవింద్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ శనివారం నియామకపత్రం అందించారు. మొయినాబాద్ మండలంలో శనివారం జరిగిన సమావేశంలో ఈ నియామకం జరిగినట్లు అరవింద్ తెలిపారు. తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన నియోజకవర్గ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చుతానన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా మాణయ్య

షాబాద్: మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామానికి చెందిన మద్దూరు మాణయ్యను బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నరెడ్లగూడ గ్రామానికి చెందిన బర్క శ్రీశైలంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం వారికి నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తదితరులు ఉన్నారు.

జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ప్రశాంత్‌గౌడ్

షాద్‌నగర్: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన రొడ్డ ప్రశాంత్‌గౌడ్ ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ప్రశాంత్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్టీని గ్రామ స్థాయిలో పటిష్టం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో స్వాతంత్య్ర సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభివృద్ధికి బాబు జగ్జీవన్‌రామ్ అవిశ్రాంతంగా పోరాడారని గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, సమ సమాజ స్థాపనకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో అంబేద్కర్ సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


చేవెళ్లలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


షాబాద్: నాగరగూడలో..


మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ చౌరస్తాలో..

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

కేశంపేట: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన వడ్డే మాళి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడికి బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును రవీందర్‌యాదవ్ శనివారం అతని భార్య వడ్డె భాగ్యమ్మకు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ బదిలీ

కేశంపేట: మండలంలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న కుప్పగిరి లింగం కేపీహెచ్‌బీకి బదిలీ అయ్యారు. కేశంపేటకు శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్ బదిలీ అయ్యారు. సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి శనివారం రాత్రి బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు.

హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో ఉన్న చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు రఘుపతి శర్మ, రాఘవేంద్రాచార్య, కృష్ణ, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో పూజా కార్యాక్రమాలు జరిగాయి. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలగౌడ్, అన్నారం రఘు, రమేశ్, రఘునందన్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణచారి, ప్రవీణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బస్సుల్లేక విద్యార్థుల అవస్థలు

ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలు


పాఠశాలకు ప్రైవేట్ వాహనంలో వెళ్తున్న విద్యార్థులు

శంకర్‌పల్లి: మండలంలోని పలు గ్రామాల ప్రజలు, విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అంతప్పగూడ, సంకేపల్లి, మాసానిగూడ, పర్వేద గ్రామాల విద్యార్థుల పరిస్థితి మరీ దారుణం. శనివారం అంతప్పగూడ గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఓ ప్రైవేట్ వాహనాన్ని ఆశ్రయించి.. పాఠశాలకు వెళ్తున్నారు. డబ్బుల్లేక ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సైతం.. ఇలాంటి స్థితి రావడం ఇబ్బందికరం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గొప్ప జాతీయవాది శ్యాంప్రసాద్ ముఖర్జీ

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో భారతీయ జన సంగ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని శనివారం ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒకే రాజ్యాంగం, ఒకే ప్రధాని, ఒకే విధానం ఉండాలని ఆకాంక్షించిన గొప్ప జాతీయవాది శ్యాంప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


షాద్‌నగర్: శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


కేశంపేట: శ్యాంప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


చేవెళ్లలో..

ఔషధ మొక్కలతో పరిపూర్ణ ఆరోగ్యం


స్కూల్ ప్రాంగణంలో మెడిసినల్ గార్డెన్‌గా మార్చేందుకు నాటిన ఔషధ మొక్కలు

చేవెళ్ల: పాఠశాలల ఆవరణలో విద్యార్థులకు ప్రశాంతమైన వాతవారణం ఉంటే వారు బాగా చదువుకునేందుకు ఉపయోగపడుతుందని ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ నగేశ్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం ప్రిన్సిపాల్ టేనావతి ఆధ్వర్యంలో స్కూల్ ఎర్త్ క్లబ్–యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రామ్‌లో భాగంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్(సీజీఆర్) పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో స్కూల్ ప్రాంగణంలో ఔషధ మొక్కలను నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఈ మొక్కల రక్షణ, పెంచే విధానంపై అవగాహన కల్పించారు. ఈ ఔషధ మొక్కలు విద్యార్థుల పరిపూర్ణమైన ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తి పెరుగుదలకు ఉపయోగడుతాయని తెలిపారు. వీటిని జాగ్రత్తగా పెంచుకోవాలని సూచించారు. ఔషధ మొక్కలను ప్రాంగణంలో పెంచుకుంటూ అందమైన గార్డెన్‌గా తయారుచేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎర్త్ క్లబ్ మెంటర్ వంశీధర్‌రెడ్డి, అస్మా, విద్యార్థులు సీజీఆర్ సభ్యులు ఉన్నారు.

పనికి తగిన వేతనం చెల్లించాలి

వేంకటేశ్వర హెచరీస్ ఎదుట కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న కార్మికులు

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట, మంగళిగూడ గ్రామాల పరిధిలో ఉన్న వేంకటేశ్వర హెచరీస్, పౌల్ట్రీ ఫార్మ్ ఎదుట పనికి తగిన వేతనం చెల్లించాలని శనివారం కార్మికులు ధర్నా నిర్వహించారు. రోజుకు పది గంటలు పనిచేసినా సంస్థ తగిన వేతనం అందించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల క్రితం జీతాలు పెంచాలని ధర్నా చేస్తే రోజుకు 30 రూపాయల చొప్పున పెంచి రోజుకు రూ.353లు అందిస్తున్నారన్నారు. వచ్చే జీతంలో పూటగడవక కష్టంగా ఉందని ఆరోపించారు. యాజమాన్యం స్పందించి పనికి తగిన వేతనం అందించాలని కార్మికులు కోరారు. కార్యక్రమంలో శ్రీశైలం, ఆంజనేయులు, కుమార్, రఘు, శ్రీకాంత్, జంగయ్య, యాదయ్య, రాములు, జంగమ్మ, అంజమ్మ, అరుణ, మంగమ్మ పాల్గొన్నారు.